ktelugu
క్షణం క్షణం.. నిఖార్సైన సమాచారం..
1
శుక్రవారం 28-8- 2026



బీజేపీతో జగన్ కటీఫ్

- ఇండియా కూటమి వైపు చూపు
- కాంగ్రెస్ కీలక నేతతో చర్చలు?
- మారుతున్న ఏపీ రాజకీయాలు

"తెలుగు నేలపై ఊహించని సరికొత్త పొలిటికల్ డ్రామాకు తెరలేచిందా? పదేళ్ల విడదీయరాని స్నేహానికి స్వస్తి చెప్పి, కమలనాథులకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శాశ్వతంగా షాక్ ఇవ్వబోతున్నారా? ఏఐసీసీ అగ్రనేత కెసి వేణుగోపాల్‌తో బెంగళూరు వేదికగా జరిగినట్టు చెప్తున్న ఆ 'రహస్య సమరస మంతనాలు' నిజమేనా? ఢిల్లీ పీఠంపై మారిన సమీకరణాలు, సొంతరాష్ట్రంలో చంద్రబాబు హవా.. తలుపు తడుతున్న పాత కేసులు జగన్‌ను కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి వైపు నడిపిస్తున్నాయా? ఏపీ రాజకీయాన్ని కీలక మలుపు తిప్పుతున్న ఈ బిగ్ పొలిటికల్ ట్విస్ట్ సంచలనంగా మారింది.

(ఓకే తెలుగున్యూస్)

2వ పేజీలో



అమరావతిలో మరో అద్భుతం!

- కృష్ణానది తీరంలో ఎత్తైన ఫెర్రీస్ వీల్

(ఓకే తెలుగున్యూస్)

4వ పేజీలో




విజయవాడే మేయర్ గా వంగవీటి?

- తెరపైకి ఆశాకిరణ్
- టీడీపీలోకి రప్పించి అవకాశం
- మరోవైపు బోండా కుమారుడు సైతం

(ఓకే తెలుగున్యూస్)

3వ పేజీలో

మూవీ రివ్యూ :



టాక్సిక్ మూవీ... జీరో కిక్

8వ పేజీలో

లండన్ లో రేవంత్ తో హరీష్..

- మెదక్ ఎమ్మెల్యేలతో హరీష్ రావు ప్రత్యేక భేటీ
- ఆయన వెనుక ఒక ఆర్ఎస్ఎస్ నాయకుడు
- రాజ్ పుష్ప అపార్ట్మెంట్ కు హరీష్ రావు వెళ్ళేది అందుకే
- ఆంధ్ర నాయకులు చెప్పినట్టు చేస్తున్న రేవంత్..
- కవిత బయటపెట్టిన సంచలన నిజాలు



"రాజకీయాలలో రేవంత్ రెడ్డి.. హరీష్ రావు ఉప్పు నిప్పులాగా ఉంటారు. ఒకరి మీద ఒకరు విమర్శలు తీసుకుంటారు. కొన్ని సందర్భాలలో వ్యక్తిగత విషయాలను కూడా బయట పెట్టుకుంటారు.. అయితే వీరిద్దరూ ఇప్పుడు కలిసిపోయారా.. గులాబీ పార్టీని ఖతం చేయబోతున్నారా.. వీరిద్దరూ అసలు ఎక్కడ కలిశారు.. ఎక్కడ ఈ కుట్రలకు శ్రీకారం చుట్టారు.. ఈ విషయాలను తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత బయటపెట్టారు. మరి ఈ పరిణామాలు తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను ఏ విధంగా మార్చబోతాయో భవిష్యత్తు కాలం నిర్ణయిస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

5వ పేజీలో



బీజేపీతో.. జగన్ కటీఫ్

ఇండియా కూటమి వైపు చూపు
కాంగ్రెస్ కీలక నేతతో చర్చలు?
మారుతున్న ఏపీ రాజకీయాలు



(ఓకే తెలుగున్యూస్)

ఏపీ రాజకీయాల్లో ఊహించని ఒక పరిణామం జరిగిందని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. అది కూడా జాతీయ రాజకీయాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బెంగళూరు వేదికగా కాంగ్రెస్ అగ్ర నాయకత్వంతో జగన్ చర్చలు జరుపుతున్నారు అనేది దాని సారాంశం. గతంలో కూడా ఇటువంటి వార్తలు హల్చల్ చేశాయి. కర్ణాటకలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలతో జగన్మోహన్ రెడ్డి సన్నిహితంగా ఉంటున్నారని.. అందుకే బెంగళూరులో నివాసం ఏర్పాటు చేసుకున్నారని.. హైదరాబాద్ కంటే బెంగళూరు కే ప్రాధాన్యమిస్తున్నారన్నది అప్పట్లో జరిగిన ప్రచారం. ఆపై ప్రస్తుత కర్ణాటక సీఎం డీకే శివకుమార్ మద్దతు జగన్మోహన్ రెడ్డికి ఉన్నట్లు కూడా ప్రచారం నడిచింది. డీకే శివకుమార్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి సన్నిహితుడు కూడా. అయితే ఈ పరిణామాల క్రమంలో తాజాగా ఏఐసీసీకి చెందిన ఓ అగ్రనేత జగన్ తో చర్చలు జరిపారన్నది ప్రధాన సారాంశం.

బిజెపితో సన్నిహిత సంబంధాలు..

వాస్తవానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు నుంచి బిజెపి పెద్దలతో మంచి సంబంధాలు నడుపుతూ వచ్చారు జగన్మోహన్ రెడ్డి. దాదాపు గత పదేళ్లుగా కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి పలు కీలక బిల్లులు, విధానపరమైన నిర్ణయాలు జగన్ బే షరతుగా మద్దతు ప్రకటించారు. ఇప్పుడు కూడా బిజెపికి మద్దతుగా ఉంటున్నారు. కానీ ఆయన రాజకీయ విధానాన్ని ప్రశ్నించేలా ఉంది. అందుకే ఆయన పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. పైగా ఏపీకి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది కేంద్ర ప్రభుత్వం. ప్రధాన భాగస్వామ్య టిడిపి ఉండడంతో చంద్రబాబుకు సైతం ఎనలేని గౌరవం దక్కుతోంది. దీనికి తోడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పై ఉన్న పాత కేసులకు సంబంధించి కేంద్ర నిఘా, దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగడం కూడా జగన్ మనసు మారడానికి ఒక కారణంగా తెలుస్తోంది.

కీలక చర్చలు..

బెంగళూరు వేదికగా జగన్మోహన్ రెడ్డితో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ రహస్య చర్చలు జరిపినట్లు జోరుగా ప్రచారం నడుస్తోంది. జాతీయస్థాయిలో మారుతున్న రాజకీయ పరిణామాల క్రమంలోనే జగన్ తన రాజకీయ వైఖరిని మార్చుకునేందుకు సిద్ధమవుతున్నారని సంకేతాలు వస్తున్నాయి. జాతీయ రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న మార్పులు, ఇటీవల నిరుద్యోగం, పేపర్ లీకేజీల అంశం, వ్యవస్థాగత సమస్యలపై యువత, జెన్ జీ వర్గాల్లో కేంద్ర ప్రభుత్వం పై వ్యతిరేకత క్రమంగా పెరుగుతోందని.. రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి ఇది మరింత తీవ్ర రూపం దాల్చి అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అందుకే జాతీయస్థాయిలో బిజెపికి దగ్గరగా ఉండడం కంటే.. పుంజుకుంటున్న కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమితో సంబంధాలు మెరుగుపరుచుకోవడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందవచ్చు అని జగన్ ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

జనసేనలోకి ? బడా నేత?

కీలక చర్చలు నిజమేనా?

(ఓకే తెలుగున్యూస్)

ఏపీలో కీలక రాజకీయ పరిణామం. ఉత్తరాంధ్రలో బలమైన కుటుంబం కూటమిలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ఈ ప్రచారం జరగడం విశేషం. జిల్లా పరిషత్ చైర్మన్లు, కార్పొరేషన్ మేయర్ ల పదవిని టార్గెట్ చేస్తూ కొందరు నేతలు పావులు కదుపుతున్న నేపథ్యంలో ఈ ప్రచారం బలంగా జరుగుతోంది. ప్రధానంగా సీనియర్ నేత బొత్స ఫ్యామిలీ జనసేన అగ్ర నేతలతో చర్చలు జరుపుతున్నట్లు టాక్ నడుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో గట్టెక్కాలి అంటే వైసీపీలో ఉంటే కష్టం అనే నిర్ణయానికి వచ్చిన బొత్స.. జనసేనలో చేరితే ఎలా ఉంటుంది అనే అభిప్రాయాన్ని సేకరించినట్లు తెలు స్తోంది. కొంతమంది కుటుంబ సన్నిహితులు జనసేన అగ్ర నేతలతో చర్చలు జరుపుతున్నారు అనేది ఒక ప్రధాన ఊహాగానం.

జడ్పీ పీఠంపై గురి..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది.ప్రత్యక్ష ఎన్నికలకు మొగ్గుచూపింది. బిల్లును శాసనసభలో పెట్టి ఆమోదించుకుంది. అయితే విజయనగరం జిల్లాకు సంబంధించి బొత్స ఫ్యామిలీ జిల్లా పరిషత్ పీఠంపై గురిపెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బొత్స.. తన కుమార్తె డాక్టర్ అనూషను జిల్లా పరిషత్ చైర్పర్సన్ గా ఎన్నిక అయ్యేలా చేయాలని చూస్తున్నారు. ఇటీవల జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా తన కుమార్తె ఉంటుందని చెప్పుకొచ్చిన ఆయన.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గురించి ప్రస్తావించకపోవడంతో అనుమానాలకు బలం చేకూరుతోంది. వైసిపి గుర్తుపై వెళితే గెలుపు కష్టం. అందుకే జనసేన వైపు బొత్స చూస్తున్నట్లు టాక్ నడుస్తోంది. జనసేనలో చేరేందుకు ఆ ఫ్యామిలీ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

మెగా ఫ్యామిలీతో అనుబంధం..

చిరంజీవి ఫ్యామిలీతో మంచి అనుబంధం ఉంది బొత్స సత్యనారాయణ కు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వైసీపీలో ఉంటే పిల్లల రాజకీయ భవిష్యత్తు తీర్చిదిద్దలేం అన్న బెంగ బొత్స లో ఉంది. అలాగని టిడిపిలో చేరలేరు. దశాబ్దాలుగా పార్టీ పై పోరాటం చేస్తూ వస్తున్నారు. అందుకే ఇప్పుడు బొత్స దృష్టి జనసేన పై పడినట్లు తెలుస్తోంది. తన కుమార్తె డాక్టర్ అనూష కు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా ఏకగ్రీవంగా ఇస్తే జనసేనలో చేరేందుకు బొత్స ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంలో తెలుగుదేశం పార్టీ అభ్యంతరాలను జనసేన పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. బొత్స లాంటి పెద్ద నేత జనసేన లోకి వస్తే కచ్చితంగా కూటమిపై ప్రభావం ఉంటుంది. అందుకే ఇప్పుడు ప్రాథమిక స్థాయిలోనే చర్చలు జరుగుతున్నాయని.. అవి కొలిక్కి వచ్చాక కూటమి ఒక్క నిర్ణయానికి వచ్చే ఛాన్స్ ఉంది.

ఏపీలో ఉద్యోగాల జాతర..!

(ఓకే తెలుగున్యూస్)

ఏపీ ప్రభుత్వం నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. 2026 జాబ్ క్యాలెండర్ కింద రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10,060 ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పోస్టులను ఒకేసారి కాకుండా అభ్యర్థుల సౌలభ్యం, పరీక్షల నిర్వహణకు అనుగుణంగా నాలుగు విడతల్లో భర్తీ చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా తొలి విడతలో 1523 పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ అయ్యింది. అయితే ఇది నిరుద్యోగులకు ఒక సువర్ణ అవకాశం. ఇప్పటికే మరో డీఎస్సీకి ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. పదివేల ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రక్రియలో భాగంగా.. రెండో దశ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభం కానుంది. మొత్తం 3231 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. వీటిలో అత్యంత కీలకమైన గ్రూపు 1 కేటగిరీలో 149 పోస్టులు ఉన్నాయి. మరోవైపు పోలీస్ విభాగంలో భారీ ఉద్యోగాల భర్తీ జరగనుంది. ఇందులో 542 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులతో పాటు 152 సివిల్ ఎస్ఐ పోస్టులు ఉన్నాయి. ఇక మూడో దశ నోటిఫికేషన్ ను అక్టోబర్ 15న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఏకంగా 2311 ఉద్యోగాలను భర్తీ చేయనుండగా.. ఇందులో గ్రూప్ 2 కేటగిరి కింద 673 పోస్టులు ఉన్నాయి. ఇందులో అత్యంత కీలకమైన డిప్యూటీ తహసిల్దార్ పోస్టులు 200 వరకు ఉన్నాయి. వీటితో పాటు వివిధ ఇంజనీరింగ్ సర్వీసులు, ఇతర సాంకేతిక, పరిపాలన విభాగాల్లో 1638 పోస్టులను కూడా మూడో దశలో నోటిఫై చేయనున్నారు. మరోవైపు అక్టోబరు 15న నాలుగో దశ కింద 2995 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ కానుంది.

విజయవాడ మేయర్‌గా వంగవీటి?

తెరపైకి ఆశాకిరణ్

టీడీపీలోకి రప్పించి అవకాశం

మరోవైపు బోండా కుమారుడు సైతం



(ఓకే తెలుగున్యూస్)


ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు దూసుకొస్తున్నాయి. అక్టోబర్ లోపల పూర్తి చేయాలన్న ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా కసరత్తు మొదలుపెట్టింది. అయితే ముందుగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆసక్తిగా ఉంది. దాదాపు 100కు పైగా మున్సిపాలిటీలతోపాటు నగరపాలక పాలక సంస్థల్లో పార్టీ జెండాను ఎగురవేయాలని చూస్తోంది. కూటమిపరంగా మున్సిపల్ ఎన్నికలపై మూడు పార్టీలు దృష్టిపెట్టాయి. ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో పట్టణాలతో పాటు నగరాల్లో తమ పార్టీ అభ్యర్థిని రంగంలోకి దించాలని చూస్తున్నాయి. అయితే ప్రధానంగా నగరాలపై కూటమిలో గట్టి పోటీ కనిపిస్తోంది. ఇప్పటికే జనసేన పోటీ చేయబోయే నగరాలు ఇదేనంటూ సోషల్ మీడియా హోరెత్తుతోంది. ఈ తరుణంలో ఆ పార్టీ నాయకత్వం స్పందించింది.. బహిరంగంగా ఎవరూ మాట్లాడవద్దని.. సోషల్ మీడియా లో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని కోరింది. మరోవైపు విజయవాడ కార్పొరేషన్ మేయర్ పదవి విషయంలో ఆసక్తికర చర్చ ఒకటి జరుగుతోంది.

ఈసారి టిడిపికే ఛాన్స్..

విజయవాడ కార్పొరేషన్ మేయర్ గా ఈసారి తెలుగుదేశం పార్టీ నేత ఉండాలని ఆ పార్టీ పట్టుపడుతోంది. అయితే ఆ పార్టీలో చాలామంది ఆశావహులు ఉన్నారు. ప్రధానంగా బోండా ఉమామహేశ్వరరావు కుమారుడు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి ప్రస్తుతం శాసనసభ్యుడిగా ఉన్నారు బోండా ఉమా. మంత్రి పదవి ఆశించారు కానీ దక్కలేదు. అందుకే హాట్ కామెంట్స్ చేశారు. మొన్ననే వైసీపీకి చెందిన మాజీ మంత్రి అంబటి రాంబాబు తో వేదిక పంచుకోవడం వివాదాస్పదంగా మారింది. దీంతో హై కమాండ్ తో ఆయనకు గ్యాప్ ఏర్పడింది. ఈ తరుణంలో పార్టీ హై కమాండ్ బోండా ఉమాను పిలిచి.. వచ్చే ఎన్నికల్లో విజయవాడ మేయర్ గా కుమారుడి అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తున్నట్టు హామీ ఇచ్చింది. టిడిపి నుంచి ప్రముఖంగా ఆ పేరు మాత్రమే వినిపిస్తోంది.

నేరుగా టిడిపిలోకి తెచ్చి పోటీ..

మరోవైపు విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి మోహన్రంగా కుమార్తె ఆశా కిరణ్ రంగంలోకి దిగుతారని ప్రచారం సాగుతోంది. ఏడాది కిందట ఆమె యాక్టివ్ అయ్యారు. రంగా రాధా మిత్రమండలి పూర్వ వైభవం కోసం తహతహలాడుతున్నారు. అయితే ఆమె వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతారని పెద్ద ఎత్తున ప్రచారం నడిచింది. కానీ తర్వాత జనసేనలోకి వెళ్తారని టాక్ నడిచింది. ప్రస్తుతానికి ఆమె సోదరుడు వంగవీటి రాధాకృష్ణ తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. ఆయనకు త్వరలో ఎమ్మెల్సీ పదవి లభిస్తుందని కూడా ప్రచారం నడుస్తోంది. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలో వంగవీటి ఆశాకిరణ్ ను టిడిపిలోకి రప్పించి నేరుగా మేయర్ అభ్యర్థిగా ప్రకటిస్తారని కూడా ప్రచారం సాగుతోంది విజయవాడ పొలిటికల్ సర్కిల్స్. ఆమెను మేయర్ గా బరిలో దించడం ద్వారా వంగవీటి కుటుంబానికి గౌరవించినట్లు ఉంటుంది. అటు తరువాత రాధాకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారానికి వినియోగించుకోవాలన్నది కూటమి ప్రణాళికగా తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..



కార్పొరేట్‌కు ధీటుగా..

సోషల్ మీడియానే షేక్ చేసిన ఆ ప్రభుత్వ పాఠశాల!

(ఓకే తెలుగున్యూస్)

సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలు అంటే ఒక రకమైన చులకన భావం. అక్కడ పెద్దగా సౌకర్యాలు ఉండవు. విద్యా బోధన ప్రస్తుత పోటీ ప్రపంచానికి తగ్గట్టు ఉండదు అనేది ఒక విమర్శ. కానీ గత కొన్ని రోజులుగా ప్రభుత్వ పాఠశాలలు సైతం కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా మారుతున్నాయి. వసతుల్లోనూ, విద్యా బోధనలోనూ, ఉత్తీర్ణత శాతంలోనూ మంచి ఫలితాలు సాధిస్తున్నాయి. అందుకే ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు. తమ పిల్లలను చేర్పిస్తున్నారు. గత రెండు రోజులుగా విశాఖలోని చంద్రంపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ట్రెండింగ్ లో నిలిచింది. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తరగతి గదులు, క్రీడా ప్రాంగణాలు, ప్రయోగశాలలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిన్ననే వాటన్నింటినీ ప్రారంభించారు నారా లోకేష్.






మూడుసార్లు పాఠశాలకు లోకేష్..

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా శాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మూడుసార్లు ఆ పాఠశాలను సందర్శించారు. విశాఖ నగరంలో ఉన్న ఈ పాఠశాల లో ప్రస్తుతం మూడు వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. 110 మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 62 తరగతి గదులు ఉన్నాయి. అయితే ఇక్కడి పాఠశాలను చూసి సమూల మార్పులు చేయాలనుకున్నారు లోకేష్. సామాజిక బాధ్యతగా పరిశ్రమలు కేటాయించే నిధులను ఇక్కడ ఖర్చు చేశారు. ప్రభుత్వం సైతం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడంతో.. మొత్తం 6 కోట్ల 50 లక్షల పైచిలుకు నిధులతో.. చేపట్టిన నిర్మాణాలు పాఠశాల స్వరూపాన్ని మార్చేసాయి. ఆ ప్రాంగణంలో అడుగుపెడితే కార్పొరేట్ విద్యాసంస్థ అన్నట్టు ఉంటుంది అక్కడి పరిస్థితి.

పెద్ద ఎత్తున ప్రచారం..

మంత్రి నారా లోకేష్ ఇక్కడి నిర్మాణాలను ప్రారంభించారు. విద్యార్థులతో ముచ్చటించారు. తాను మంగళగిరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని.. కనీసం అక్కడి పాఠశాలను సందర్శించిన దాఖలాలు లేవని.. కానీ చంద్రంపాలెం ప్రభుత్వ పాఠశాలకు మూడుసార్లు వచ్చానని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలోని ది బెస్ట్ స్కూల్ అంటూ కొనియాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పక్క వారికి సాయం అందించి వారి అభివృద్ధిలో పాలుపంచుకుంటే కచ్చితంగా ఈ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని విద్యార్థులతో ముచ్చటిస్తూ అన్నారు నారా లోకేష్. అయితే భారీ నిర్మాణాలతో.. చంద్రంపాలెం ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ లుక్ సాధించడంతో సోషల్ మీడియాలో ట్రెండింగ్ గా నిలిచింది.



అమరావతిలో మరో అద్భుతం!

కృష్ణానది తీరంలో ఎత్తైన ఫెర్రీస్ వీల్



(ఓకే తెలుగున్యూస్)

అమరావతిలో మరో కీలక నిర్మాణం జరగనుంది. అమరావతి ఐ పేరుతో ప్రపంచంలోనే ఎత్తైన ఫెర్రీస్ వీల్ కృష్ణానది తీరంలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అమరావతి గ్రూప్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ టెండర్ ప్రకటన కూడా జారీ చేసింది. ప్రపంచంలోనే ఎత్తయిన ఫెర్రీస్ వీల్ ఎయిర్ దుబాయిను తలదన్నేలా... 250 మీటర్ల కంటే ఎత్తులో ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలని భావిస్తున్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తుంది. ఇప్పటికే ప్రపంచ స్థాయి డిజైన్లతో అమరావతిలో అసెంబ్లీ, హై కోర్ట్, సచివాలయం, హెచ్ ఓ డి టవర్ల నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పుడు అతి ఎత్తైన ఫెర్రీస్ వీల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ప్రపంచాన్ని ఆకర్షించనుంది.

లండన్ నమూనా గా..

ఫెర్రీస్ వీల్ కు మంచి గుర్తింపు ఉంది. లండన్ నగరంలోని థేమ్స్ నది ఒడ్డున లండన్ ఐ అనే పర్యాటక ప్రాంతం ఉంది. దాని స్ఫూర్తితోనే ఇప్పుడు కృష్ణా నది తీరంలో అమరావతి ఐ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. లండన్ ఐ ఎత్తు 120 మీటర్లు అయితే.. ఇప్పుడు కృష్ణా నది తీరంలో నిర్మించే అమరావతి ఐ 139 మీటర్ల ఎత్తులో నిర్మించాలని ఏపీ ప్రభుత్వం భావించింది. ఆ మేరకు అమరావతి గ్రూప్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. అయితే ఊహించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో నిబంధనలను సవరిస్తూ మరోసారి టెండర్లు పిలిచారు. మొదటిసారి టెండర్ ప్రకటన జారీచేసిన సమయంలో అమరావతి ఐ ఏర్పాటు కోసం ఐదు ఎకరాల భూమి, వాణిజ్య కార్యకలాపాల నిర్వహణ కోసం మరో ఎకరం మాత్రమే కేటాయించారు. అయితే ఈ ప్రాజెక్టు ప్రయోజనం తో పాటు వాణిజ్య కార్యకలాపాల కోసం మరింత భూమి అవసరమనే అభిప్రాయం వ్యక్తం అయింది. దీంతో నిబంధనలను సవరిస్తూ తాజాగా టెండర్లకు పిలిచారు.

దుబాయ్ కంటే ఎత్తైనది..

అయితే ప్రపంచంలోనే ఎత్తయిన ఫెర్రీస్ వీల్ దుబాయ్ లో ఉంది. 250 మీటర్ల ఎత్తులో ఉంటుంది. మొత్తం 1750 మంది ఇందులో కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. అందుకే దాని నమూనాగా.. అంతకుమించి అన్నట్టు.. ఈద్ దుబాయ్ కంటే అంటే 250 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తైన సర్వీస్ వీల్స్ అమరావతిలో ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. అందుకే మూడు కేటగిరీల్లో టెండర్లు ఆహ్వానిస్తున్నారు. 250 మీటర్ల కంటే ఎత్తు, 128 నుంచి 175 మీటర్ల ఎత్తు, 175 నుంచి 200 మీటర్ల ఎత్తయిన ఫెర్రీస్ వీల్స్ ఇలా మూడు విభాగాలుగా విభజించారు. అందుకు అనుగుణంగా టెండర్లు పిలవనున్నారు.

ఏపీలో కొత్త పింఛన్లు!

(ఓకే తెలుగున్యూస్)

ఏపీలో కొత్తగా పింఛన్ల కోసం ఎదురుచూసే వారికి గుడ్ న్యూస్ చెప్పింది ప్రభుత్వం. ఎన్టీఆర్ భరోసా పథకం కింద కొత్తగా 3 లక్షల మందికి సామాజిక భద్రత పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. ముందుగా రాష్ట్రవ్యాప్తంగా వితంతువులు, వృద్ధులకు పింఛన్లు అందజేయనున్నారు. సెప్టెంబర్ రెండో వారం నుంచి కొత్త పింఛన్లకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తారు. అనంతరం వీటిని పరిశీలించి.. అక్టోబర్ నెలలో కొత్త పింఛన్లు పంపిణీ చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ అధికారులు గత వారం రోజులుగా కొత్త పింఛన్లపై కసరత్తు చేస్తున్నారు. కొత్త పింఛన్లకు సంబంధించి ఏపీ ప్రభుత్వం సెప్టెంబరు మొదటి వారంలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.



సమగ్ర కుటుంబ సర్వే ప్రాతిపదికతో..

రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పింఛన్ కు అర్హులను గుర్తించేందుకు సమగ్ర కుటుంబ సర్వేను ప్రాతిపదికగా తీసుకుంది. అలా రాష్ట్ర వ్యాప్తంగా 1.70 లక్షల మంది వితంతువులు ఉన్నట్లు గుర్తించారు. పింఛన్లకు సంబంధించిన అర్హుల వివరాలను ఆరు అంచెల నిబంధనలతో తనిఖీ చేయించింది. చివరిగా 1.50 లక్షల మంది అర్హులు ఉన్నట్లు ప్రాథమికంగా ఒక నిర్ధారణకు వచ్చింది. వచ్చే నెలలో దరఖాస్తులు స్వీకరించిన అనంతరం మరోసారి పరిశీలిస్తారు. గత ప్రభుత్వ హయాంలో మరో లక్ష మందికి సంబంధించిన సమాచారాన్ని కూడా అధికారులు సేకరించారు. మరోవైపు చేనేత కార్మికులు, గీత కార్మికులు, చర్మకారులు, దప్పు కళాకారులు వంటి వృత్తిపరమైన పింఛను కేటగిరి వారి వివరాలు కూడా సహకరిస్తున్నారు. ఈ క్యాటగిరిలో 60 వేల నుంచి 70 వేల వరకు ఉంటారని ఒక అంచనా.

స్థానిక ఎన్నికల దృష్ట్యా..

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం మొగ్గు చూపుతున్న నేపథ్యంలోనే ఈ కొత్త పింఛన్లకు సంబంధించి కదలిక వచ్చింది. అర్హులైన వృద్ధులతో పాటు వితంతువులకు ముందుగా పింఛన్లు అందించాలని నిర్ణయించింది ప్రభుత్వం. అయితే ఎన్నికలకు ముందు దరఖాస్తుల స్వీకరణ చేపట్టి.. ఎన్నికలు ముగిశాక కొత్త పింఛన్లు ఇచ్చే అవకాశం ఉంది. అయితే ఈ కొత్త పింఛన్లు అనేవి కూటమికి సానుకూల అంశంగా మారే అవకాశం ఉంది. అక్టోబర్లో కొత్త పింఛన్లకు సంబంధించి అర్హుల పేర్లు వెల్లడించే అవకాశం ఉంది. జాబితాను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఈడి సడన్ ఎంట్రీ!

(ఓకే తెలుగున్యూస్)

వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డి అరెస్ట్ తప్పదా? సడన్ గా ఈడి ఎంట్రీ ఎందుకు ఇచ్చింది? దీని వెనుక ఉన్న కథ ఏంటి? కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయిన తర్వాత ఈ పరిణామాలు జరిగినట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. శుక్రవారం రోజంతా ఎంపీ అవినాష్ రెడ్డి తో పాటు వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుల ఇళ్లలో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అధికారులు తనిఖీలు చేశారు. దీని వెనుక ఏదో ఒక కారణం ఉందన్న అనుమానం పెరుగుతోంది. ఇప్పటివరకు సిబిఐ దర్యాప్తు చేస్తుండగా.. అకస్మాత్తుగా ఈ డి ఎందుకు ఎంట్రీ ఇచ్చింది అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. అయితే ఈడి తనిఖీల్లో భారీగా అక్రమ నగదు పట్టుబడినట్లు ప్రచారం నడుస్తోంది. అసలు ఈ హత్యకు సంబంధించి ఈడి రంగంలోకి దిగడమే ఇప్పుడు అందరి చూపు ఈ కేసు పై పడింది.

మొన్నటి ఎన్నికల్లో నష్టం..

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు అధినేత జగన్మోహన్ రెడ్డిని బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య కేసు వెంటాడుతోంది. మొన్నటి ఎన్నికల్లో కడప జిల్లాతో పాటు రాయలసీమలో తీవ్రంగా నష్టం చేసింది. వివేకానంద రెడ్డి హత్య కేసులో అసలు నిందితులను జగన్ కాపాడుతున్నారని, కొమ్ము కాస్తున్నారంటూ వివేక కుమార్తె సునీత, జగన్ సోదరి షర్మిల ఆరోపిస్తూ వచ్చారు. న్యాయం కోసం సునీత ఎక్కని గడపలేదు. న్యాయ పోరాటం చేస్తూనే ఉన్నారు. కానీ ఆమె అనుకున్న స్థాయిలో సిబిఐ దర్యాప్తు సాగలేదు. రాజకీయ లబ్ధి కోసమే వివేకానంద రెడ్డి హత్య జరిగింది అనేది ఆమె ఆరోపణ. ఇదే వాదనతో ఆమె న్యాయ పోరాటం చేస్తున్నారు. అయితే ఓ సెటిల్మెంట్ కు సంబంధించి.. ఆర్థికపరమైన విభేదాలతోనే ఈ హత్య జరిగినట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుకూల మీడియాలో ప్రచారం జరిగింది. ఇది రాజకీయ ఆధిపత్యం కోసం జరిగిన హత్య కాదు అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. కానీ సునీత గత ఏడు సంవత్సరాలుగా న్యాయ పోరాటం చేస్తూనే ఉన్నారు. వైసిపి ఐదేళ్ల కాలంలో సిబిఐ దర్యాప్తు సవ్యంగా సాగలేదు. అప్పట్లో ఉన్న సాక్షాలను చెరిపేసారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంతటితో ముందుకు వెళ్లలేమని సిబిఐ కూ డా తేల్చి చెప్పింది.అయితే ఇప్పుడు సడన్ గా ఈడి ఎంట్రీ ఇవ్వడమే అందరిలోనూ ఒక రకమైన ఆత్రుత. ఆర్థికపరమైన లావా దేవీలు మూలంగా హత్య జరిగింది అనేది వైసీపీ నుంచి వస్తున్న వాదన. దీంతో ఈడి విచారణకు ఎంట్రీ ఇచ్చి ఉండచ్చు అన్న అనుమానం వ్యక్తం అవుతోంది.



జగన్ కడపకు తెచ్చింది ఫిష్ మార్ట్..
కూటమి తెచ్చింది స్టార్టప్ హబ్

సీఎంగా ఉన్నప్పుడు జగన్ ఫిష్ మార్ట్ ఓపెన్ చేసి.. కడప ప్రజలు ఫ్రెష్ చేపలు తింటారని మీరు ఊహించి ఉండరని గొప్పలు చెప్పుకున్నారు. కానీ ప్రారంభించిన మూడు నెలల్లోనే అది మూతపడింది. జగన్ తన ఆలోచనల్ని ఫిష్ మార్టుల వద్దే ఉంచితే.. కూటమి రాయలసీమ యువతకు ఐటీ, ఆవిష్కరణల రంగాన్ని చెంతకు చేరుస్తూ రూ. 12 కోట్లతో, 30,000 చ.అడుగులలో కడప స్టార్టప్ హబ్‌ను నిర్మించింది.ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి " అన్న సీఎం విజన్‌కు అనుగుణంగా 4 మోడల్‌లో నిర్మించారు.ఒకేసారి 400 మంది పనిచేసేలా ప్లగ్ అండ్ ప్లే స్పేస్, ఐఐటీ, ఐఐఎం నిపుణుల మెంటార్‌షిప్, హై-స్పీడ్ ఇంటర్నెట్, ప్రోటోటైపింగ్ ల్యాబ్‌లు, గ్లోబల్ వెంచర్ క్యాపిటలిస్టులతో ఫండింగ్ కనెక్టివిటీ కల్పించారు.

లండన్ లో రేవంత్ తో హరీష్

తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత బయటపెట్టిన సంచలన నిజం



రాజకీయాలలో రేవంత్ రెడ్డి.. హరీష్ రావు ఉప్పు నిప్పులాగా ఉంటారు. ఒకరి మీద ఒకరు విమర్శలు తీసుకుంటారు. కొన్ని సందర్భాలలో వ్యక్తిగత విషయాలను కూడా బయట పెట్టుకుంటారు.. అయితే వీరిద్దరూ ఇప్పుడు కలిసిపోయారా.. గులాబీ పార్టీని ఖతం చేయబోతున్నారా.. వీరిద్దరూ అసలు ఎక్కడ కలిశారు.. ఎక్కడ ఈ కుట్రలకు శ్రీకారం చుట్టారు.. ఈ విషయాలను తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత బయటపెట్టారు.

కవిత విలేకరుల సమావేశం

చాలా రోజుల తర్వాత కల్వకుంట్ల కవిత విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని.. భారత రాష్ట్ర సమితి కీలక నాయకుడు హరీష్ రావును లక్ష్యంగా చేసుకుని కవిత విమర్శలు చేశారు. హరీష్ రావు.. రేవంత్ రెడ్డి కలిసి ఆంధ్ర ప్రాంతానికి సంబంధించిన కంపెనీలకు లాభం చేకూర్చే విధంగా పనిచేస్తున్నారట. అధికారంలో ఎవరు ఉన్నా సరే చివరికి ఆంధ్ర ప్రాంత కంపెనీలు.. ఆ ప్రాంతానికి సంబంధించిన నాయకుల మాటే చెల్లుబాటు అవుతోందట. అయితే ఈ లెక్కన కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆంధ్రా ప్రాంతానికి చెందిన కంపెనీల మాటనే చెల్లుబాటు అయినట్టా.. ఆ ప్రకారం చూసుకుంటే కేసీఆర్ కూడా ద్రోహినే కదా.. ఈ మాట మీద నిలబడుతుందా కవిత..

అంతేకాదట పాలలో మిరియాలు.. పసుపు కలుపుకొని తాగే అలవాటు ఉన్న రాష్ట్రీయ ఆర్ఎస్ఎస్ నాయకుడి ఆదేశాలకు అనుగుణంగా హరీష్ రావు పనిచేస్తున్నారట. ఆ ఆర్ఎస్ఎస్ నేత హరీష్ రావు ఇంటికి వస్తున్నప్పుడు పసుపు.. మిరియాలు కలిపిన పాలు సిద్ధం చేస్తారట.. ఆ నాయకుడిని కలవడానికి హరీష్ రావు రాజ్ పుష్ప సంస్థలోని ఓపెన్ స్కై విల్లా కు వెళ్తారట.

ఇటీవల మెదక్ నగరంలో ఎమ్మెల్యేలతో హరీష్ రావు సమావేశమయ్యారట. భవిష్యత్తు తమది అని చెప్పారట. ఆ మీటింగ్ లో ఉన్న ఒక ఎమ్మెల్యే ఈ విషయాన్ని కవితకు వివరించారట. అంతేకాదు ఎన్టీఆర్ మాదిరిగానే కేసీఆర్ పెద్ద నాయకుడని.. ఆ తర్వాత పార్టీని తాను చూసుకుంటానని హరీష్ రావు ఆ ఎమ్మెల్యేలకు చెప్పారట.. దాని వెనుక వ్యవహారాన్ని బిజెపి చూసుకుంటుందని ఆ ఎమ్మెల్యేలకు హరీష్ రావు భరోసా ఇచ్చారట.. అయితే ఇదంతా కూడా గులాబీ పార్టీని భారతీయ జనతా పార్టీలో విలీనం చేయడానికి జరుగుతున్న ప్రక్రియ అని కవిత కుండబద్దలు కొట్టారు.

ఇక్కడితోనే కవిత ఆగిపోలేదు.. హరీష్ రావు మీద మరో ఆరోపణలు కూడా చేశారు. ఆంధ్ర ప్రాంతానికి సంబంధించిన శ్రీ చైతన్య.. నారాయణ విద్యాసంస్థలకు హరీష్ రావు సతీమణి భాగస్వామిగా ఉన్న సంస్థ నుంచి పాలు వెళ్తున్నాయట. ముఖ్యంగా కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటి నుంచి ఈ వ్యవహారం సాగుతోందట. దాదాపు వందల కోట్ల రూపాయల విలువైన పాలను హరీష్ రావు సతీమణి భాగస్వామిగా ఉన్న సంస్థ విక్రయించిందట. ఉదయం లేస్తే ఆంధ్ర ప్రాంతానికి సంబంధించిన వ్యక్తుల మీద విమర్శలు చేస్తే హరీష్ రావు.. ఆ ప్రాంతానికి సంబంధించిన విద్యాసంస్థలకు ఎలా పాలు పోస్తారని కవిత సూటిగానే ప్రశ్నించారు.

కవిత ఆరోపణలు చేసినట్టుగా రేవంత్ రెడ్డి.. హరీష్ రావు కలిసి పోయారా.. ఒకవేళ అలా కలిసిపోతే ఓపెన్ గానే ఈ విషయాన్ని చెప్పవచ్చు కదా.. పైగా హరీష్ రావును ఉద్దేశించి రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారు. హరీష్ రావు కూడా ఏమాత్రం తగ్గకుండా అదే స్థాయిలో మండిపడుతున్నారు. కవిత మాత్రం వీరిద్దరూ కలిసిపోయారని చెబుతున్నారు. మొత్తంగా చూస్తే ఈ రాజకీయ చదరంగంలో ఎవరితో ఎవరు ఉంటారు.. ఎవరితో ఎవరు విడిపోతారు.. అనేది అర్థం కాకుండా ఉంది. గతంలో గులాబీ పార్టీలో కీలక నాయకురాలుగా కవిత ఉండేది. తన అన్న గురించి.. నాన్న గురించి గొప్పగా చెప్పుకునేది. పార్టీ గురించి కూడా అద్భుతంగా వివరించేది. తన బావ హరీష్ రావు గురించి కూడా గొప్పగా మాట్లాడేది. కానీ ఇప్పుడు స్వరం మార్చింది.. విమర్శల జోరు పెంచింది. అందుకే అంటారు రాజకీయాలు అనేవి పరమ కపరమైనవని.. తెలంగాణలో జరుగుతున్న ఈ పరిణామాలు చూస్తే అవి నూటికి నూరు శాతం కాదు కోటి శాతం నిజమని అర్థమవుతోంది.

బండి.. గంగుల.. పొన్నం అలయ్ బలయ్

రాజకీయ నాయకులు తెర ముందు మాత్రమే సవాళ్లు విసురుకుంటారు. కత్తులు దూసుకుంటారు. బస్తిమే సవాల్ అంటూ యుద్ధానికి దిగుతారు. కానీ ఆ యుద్ధంలో సమిధలు అయ్యేది కార్యకర్తలు మాత్రమే. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి మొదలుపెడితే ఇప్పటివరకు రాజకీయ పార్టీ నాయకులు ఏనాడు కూడా పరస్పరం తగువులు పెట్టుకోరు. పోరాటాలు చేసుకోరు. మధ్యలో ఉన్న కార్యకర్తలు మాత్రమే బలి పశువులు అవుతుంటారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పార్లమెంటు సభ్యుడిగా బండి సంజయ్ కొనసాగుతున్నారు. ఆయన హోం శాఖ సహాయ మంత్రిగా కూడా ఉన్నారు. ఇదే జిల్లా నుంచి ఎమ్మెల్యేగా గంగుల కమలాకర్ కొనసాగుతున్నారు. ఈయన గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం ఇదే జిల్లా నుంచి పొన్నం ప్రభాకర్ మంత్రిగా ఉన్నారు. ఈయన కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. వాస్తవానికి ఈ ముగ్గురు రాజకీయ నాయకుల మధ్య వైరం ఉంది. ఇటీవల కేంద్రమంత్రి కుమారుడు వ్యవహారంలో గంగుల కమలాకర్.. పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు కూడా చేశారు. గులాబీ పార్టీ నేతల ఆధ్వర్యంలో కరీంనగర్లో కేంద్ర మంత్రి కుమారుడి దిష్టిబొమ్మలు కూడా దహనం చేశారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు కూడా చేసుకున్నారు.

ఇప్పుడు కరీంనగర్ జిల్లాలో సన్నివేశం ఏంటంటే.. బండి సంజయ్.. పొన్నం ప్రభాకర్.. గంగుల కమలాకర్ కలసి పోయారు. ఎన్నికల సమయంలో చేసుకున్న విమర్శలను మర్చిపోయారు. ఇటీవల కాలంలో చేసుకున్న ఆరోపణలను పక్కన పెట్టారు. ఒకే వేదిక మీద నవ్వులు చిందించారు. అద్భుతంగా ఫోటోలు దిగారు. సామూహికంగా భోజనాలు కూడా చేశారు. కుశల ప్రశ్నలు వేసుకున్నారు. అంటే రాజకీయ నాయకులు అనంతమాత్రాన పరస్పరం విరోధులుగా.. శత్రువులుగా ఉండాలని అని చెప్పడం లేదు. కానీ వీరు మాట్లాడే మాటలు ద్వారా చాలామంది కార్యకర్తలు వైరాన్ని పెంచుకుంటున్నారు. శత్రుత్వాన్ని ప్రోది చేసుకుంటున్నారు. తద్వారా తమ మనుషులను అనే విషయాన్ని మర్చిపోయి పరస్పరం తగువులు పెట్టుకుంటున్నారు. కొన్ని సందర్భాలలో దాడులకు కూడా తెగబడుతున్నారు.

తేల్చుకోవాల్సింది ఇక కార్యకర్తలే..

అందువల్లే రాజకీయ నాయకులను చూసి కార్యకర్తలు నేర్చుకోవాలి. ప్రజలు ఇంకా నేర్చుకోవాలి. ఎందుకంటే రాజకీయ నాయకులు రాజకీయాలు చేస్తారు. వ్యాపార విషయంలో.. వ్యక్తిగత సంబంధాల



విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గరు. ఇక తాజాగా ఈ ముగ్గురు నాయకులు కలిసిన సందర్భం ఏంటంటే బండి సంజయ్ సోదరుడు బండి శ్రవణ్ కుమార్తె వివాహం జరిగింది. ఆ వివాహానికి ఈ ముగ్గురు హాజరయ్యారు. ఈ వివాహ వేదిక మీదుగానే వారి ముగ్గురు గట్టి సంకేతాలు ఇచ్చారు. తేల్చుకోవాల్సింది ఇక కార్యకర్తలే..

ఇది మామూలు దారుణం కాదు. ఘోరానికే ఘోరం. సభ్య సమాజం తలదించుకునే పైశాచికత్వం. అసలు మనుషులు ఇలా ఎందుకు మారిపోతున్నారు.. ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నారు.. చివరికి రాక్షసులను సైతం మించిపోతున్నారు.. జంతువుల కంటే హీనంగా ఎందుకు ఉంటున్నారు.. అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ దారుణానికి పాల్పడిన వ్యక్తులను ఏం చేయాలి.. మన చట్టం వీరిని ఏం చేయగలుగుతుంది.. ఎలా శిక్షించగలుగుతుంది.. ఎలాంటి నిబంధనలు వీరికి కఠిన గుణపాఠం చెబుతాయి.. మనుషులు ఉచ్ఛ నీచాలు మరిచిపోయి ఇలా ప్రవర్తిస్తుంటే.. ఇంతకంటే దారుణం ఇంకోటే ఉంటుంది. ఇంతకంటే హీనం మరొకటి ఏముంటుంది.. వీళ్లను చూస్తే జంతువులు కూడా సిగ్గుపడతాయి. రాక్షసులు కూడా తలదించుకుంటారు..

కాడుకు లాంటి వ్యక్తితో

ఓ మహిళ యవ్వారం..

» ప్రియుడితో కలిసి భర్తను చంపించింది

» పోలీసుల విచారణలో విస్తుగొలిపే వాస్తవాలు



పోలీసుల అదుపులో శివ, శారద(ముసుగులో ఉన్న వారు)

కట్టు తప్పే వ్యవహారాలు కొంపముంచుతాయి.. వెనుకటికి ఈ మాటను మన పెద్దలు ఊరికే చెప్పలేదు. అనుభవంతోనే వారు ఆ మాట అన్నారు. ఇప్పుడు ఈ మహిళ విషయంలో అది పూర్తిగా నిజమైంది.

భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డి గూడానికి చెందిన రాపోలు దానయ్యకు శారదకు వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు.. ఒక కుమారుడు ఉన్నారు. వీరు పంతంగి శివారులో శనిగల గుట్ట లక్ష్మీనరసింహస్వామి గుడికి దగ్గరలో ఉన్న భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు.. శారద మనస్తత్వం స్థిరంగా ఉండేది కాదు. ఈమె పలువురితో ఇతర సంబంధాలు పెట్టుకున్నట్టు అభియోగాలు ఉంది. ఇవి దానయ్య దృష్టికి రావడంతో ఆమెను అనేక పర్యాయాలు మందలించాడు. గతంలో శారద పంతంగి గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో కలిసి పారిపోయింది.. కొద్ది రోజుల తర్వాత మళ్లీ భర్త వద్దకు వచ్చింది. ఇక ఇటీవల దానయ్య సొంత అన్న కుమారుడితోనే ఆమె వ్యవహారం మొదలు పెట్టింది. ఈ వ్యవహారం దానయ్యకు తెలియడంతో ఇద్దరిని మందలించాడు. అయితే తమ బంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన శివ.. దానయ్యను అంతం చేస్తానని హెచ్చరించాడు.

పొలం వద్దకు పిలిపించుకుంది

ఇటీవల దానయ్య సూర్యాపేట జిల్లాలోని దురాజ్‌పల్లి అనే గ్రామానికి వెళ్లాల్సి ఉండేది. అయితే శారద అతడిని ఆ గ్రామానికి వెళ్లకుండా పొలం వద్దకు తీసుకెళ్లింది. అనంతరం శివను పొలం వద్దకు పిలిపించుకుంది. శివ రాగానే.. శారద అతడితో ఏకాంతంగా గడపడం మొదలుపెట్టింది. దానయ్య గమనించి శివ తో గొడవపడ్డాడు. వారిద్దరు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో దానయ్య కింద పడిపోయాడు. అతడిని శారద గట్టిగా పట్టుకుంది. ఆ తర్వాత శివ అక్కడ ఉన్న రాళ్లతో దానయ్య మీద దారుణంగా దాడి చేసి.. అంతం చేశాడు.

దానయ్య విగత జీవిగా మారడంతో..

దానయ్య విగత జీవిగా మారడంతో గమనించిన శారద పక్కనే ఉన్న పొలంలో పనిచేస్తున్న వ్యక్తి వద్దకు వెళ్ళింది. తన భర్త కనిపించడం లేదని చెప్పింది. చుట్టుపక్కల వెతికి చూడగా దానయ్య చనిపోయి కనిపించాడు. ఆ తర్వాత పోలీసులకు ఈ విషయం తెలియడంతో వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులను అనుచరించగా చాలామంది శారద ప్రవర్తన పై అనుమానం వ్యక్తం చేశారు. ఆమెను అధువులకు తీసుకొని విచారించారు. దీంతో ఆమె నిజం ఒప్పుకుంది. అయితే శివ అప్పటికే పారిపోయాడు. తన దుస్తులను.. మొబైల్ ఫోన్ ను చిట్యాల మండలం గుండ్రంపల్లి చెరువులో పడేశాడు. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. పంతంగి టోల్ ప్లాజా దగ్గర పోలీసులకు శివ పట్టుబడ్డాడు. శారద.. శివను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. శారదకు అనేక మందితో ఇతర సంబంధాలు ఉన్నాయని.. ఆమెకు సామాజిక మాధ్యమాలలో అనేక రకాల ఖాతాలు ఉన్నాయని పోలీసులు ప్రకటించారు. చౌటుప్పల్ మండలంలో చాలామంది రాజకీయ నాయకులతో ఆమెకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పోలీసుల విచారణలో తేలింది.

క్రీడాకారిణి తో ఎకసెక్కాలు..

మంత్రి ముందే ఇచ్చి పడేసింది..



భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు ఓ మంత్రి మీద ఇప్పుడు సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారిణి తక్కల్లపల్లి ప్రతిభ ఇటీవల ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె కీలక విషయాలను బయటపెట్టారు. నాడు తనని ఇబ్బంది పెట్టారని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి మెడల్స్ తీసుకు వస్తే.. ప్రోత్సహించాల్సింది పోయి.. అందంగా ఉన్నావు.. కలుస్తావా అంటూ ఇబ్బందికరంగా వ్యాఖ్యానించారని ప్రతిభ ఆరోపించింది.

బాడీలో ఏ పార్టీ కూడా పనిచేయకుండా చేస్తా

ప్రతిభ మాట్లాడిన మాటలు తెలంగాణ రాజకీయాలలో సంచలనం కలిగించాయి. తనకు అతడి వ్యవహార శైలి నచ్చకపోవడంతో అప్పటికే నాడు క్రీడా శాఖ మంత్రిగా ఉన్న వ్యక్తికి గట్టిగా వార్నింగ్ ఇచ్చానని చెప్పింది. నాతో అనవసరమైన వ్యవహారాలకు పాల్పడితే.. రెండు నిమిషాలలో నీ బాడీలో ఏ పార్టీ కూడా పనిచేయకుండా చేస్తా అంటూ.. మంత్రి ముందే హెచ్చరించింది. ఈ వీడియో బయటకి విడుదల కావడంతో తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో పెను దుమారం ఏర్పడింది. గత ప్రభుత్వంలో ఇది చోటు చేసుకోవడంతో కాంగ్రెస్ నాయకులు రంగంలోకి వచ్చారు.. ఆ క్రీడాకారిణి మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియోలను విపరీతంగా సర్కులేట్ చేయడం మొదలుపెట్టారు. ఫలితంగా రాజకీయ వర్గాలలో ఈ వీడియో విపరీతంగా చర్చకు దారి తీస్తోంది. గత ప్రభుత్వంలో ప్లేయర్లకు ముఖ్యంగా మహిళలకు ఇటువంటి అనుభవం ఎదురైందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు.. గులాబీ పార్టీ సోషల్ మీడియా ఇటువంటి వాటిని ఎలా సమర్థించుకుంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. కొండా సురేఖ అంశానికి విపరీతమైన ప్రయారిటీ ఇచ్చిన మీడియా.. ఇటువంటి విషయాలను ఎందుకు పట్టించుకోదని కాంగ్రెస్ నాయకులు సెటైర్లు వేస్తున్నారు.

సోషల్ మీడియాలో సంచలనం

సదరు క్రీడాకారిణి మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తున్న నేపథ్యంలో.. ఇంతవరకు నాటి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన వ్యక్తి నుంచి ఎటువంటి స్పందన రాలేదు. అయితే కొన్ని వీడియోలు మాత్రం ఇప్పుడు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి.. ఆ ప్రకారం చేసుకుంటే నాడు జరిగిన ఘటనలో సదరు మంత్రి త్వరగానే స్పందించారని తెలుస్తోంది. నాడు మంత్రి పేషిలో పనిచేసిన ఒక వ్యక్తి ఇలా వ్యవహరించారని సమాచారం. ఈ క్రమంలో నాడు మంత్రి ఆ వ్యక్తిని విధుల నుంచి తొలగించినట్టు ప్రచారంలో ఉంది. అప్పట్లో మంత్రి తీసుకున్న నిర్ణయం పట్ల మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. అయితే నాడు సదరు క్రీడాకారిణి మాట్లాడిన మాటలు వేరే విధంగా ఉన్నాయి. ఇప్పుడు మరో విధంగా ఉన్నాయి. దీంతో ఆమె మీద సోషల్ మీడియాలో గులాబీ పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు. అప్పుడు ఒక విధంగా మాట్లాడి.. ఇప్పుడు మరో విధంగా మాట్లాడటం ఎంతవరకు సమంజసం అని ఆమెని ప్రశ్నిస్తున్నారు. మరి దీనిపై సదరు అథ్లెట్ ఏ విధంగా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

మాయదారి ప్రేమ కోసం

తల్లిదండ్రులను చంపేసింది

చివరికి తానూ ఆత్మహత్య చేసుకుంది.. ఈ అమ్మాయి ఉదంతం ఎందరికో గుణపాఠం

వయసు వేడిలో చాలామంది యువత తప్పుదారులు పడుతున్నారు. దారుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఘోరమైన పనులకు పాల్పడుతున్నారు. చివరికి వారిలో పశ్చాత్తాపం కలిగినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఈమె జీవితం కూడా అలాంటిదే. చేసిన తప్పు మామూలుది కాదు. సభ్య సమాజం ఈమె చేసిన దారుణాన్ని చూసి తలదించుకుంది. చివరికి ఏమైందో తెలియదు.. ఆమెలో ఎటువంటి బాధ ఆవహించిందో అర్థం కాలేదు. కానీ కఠినమైన నిర్ణయం తీసుకుంది. సంగారెడ్డిలో నర్స్‌గా పనిచేస్తూ ఉండేది సురేఖ అనే యువతి. ఈమెకు 25 సంవత్సరాలు. కుటుంబం పరంగా ఆర్థిక సమస్యలు లేవు. ఈమెకు ఒక సోదరుడు ఉన్నారు. ఈ క్రమంలో సురేఖ ఓ యువకుడితో ప్రేమ వ్యవహారం కొనసాగించడం మొదలుపెట్టింది. అతడితోనే వివాహం జరిపించాలని కోరింది. దానికి ఆమె తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. కొద్దిరోజులు వారితో సురేఖ మాట్లాడలేదు. ఆ తర్వాత తన ప్రియుడి గురించి వారితో చర్చించడం మొదలుపెట్టింది. అయినప్పటికీ అతడితో పెళ్లికి వారు ఒప్పుకోలేదు. దీంతో సురేఖ వారి మీద ఆగ్రహం పెంచుకుంది. ప్రతిసారి తనను ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో వారిని అంతం చేయాలని భావించింది. సరిగా ఏడు నెలల క్రితం ఇంటికి వెళ్లిన సురేఖ.. తల్లిదండ్రులకు మత్తుమందు ఇచ్చింది. ఆ మత్తులోనే వారిద్దరు చనిపోయారు. ఆ తర్వాత వారిద్దరికీ గుండెపోటు వచ్చిందని కుటుంబ సభ్యులను నమ్మించే ప్రయత్నం చేసింది. మహానటి లెవెల్లో ఫెర్ఫార్మన్స్ ఇచ్చింది. కానీ.. ఆమె మాట్లాడిన మాటలకు.. చెప్పిన వివరాలకు పొంతన లేకపోవడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. ప్రేమికుడితో పెళ్లి జరిపించలేదని ఆగ్రహంతోనే ఆమె ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఆమెను అరెస్ట్ చేశారు. గడిచిన ఏడు నెలలుగా ఆమె జైలు శిక్ష అనుభవించింది. ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చింది. ఈ నేపథ్యంలో సంగారెడ్డిలో ఆమె ఒక హాస్టల్లో ఉంటోంది. తన పేరెంట్స్ ను ఏ విధంగానైతే మత్తుమందు ఇచ్చి అంతం చేసిందో.. అదే తీరుగా ఆమె కూడా మత్తుమందు తనకు తాను ఇచ్చుకుని.. బలవన్మరణానికి పాల్పడింది. సురేఖ వ్యవహారం ఎంతోమందికి గుణపాఠం లాగా మారింది. వయసు వేడిలో కన్న తల్లిదండ్రులనే ఆమె మర్చిపోయింది. మాయదారి ప్రేమ కోసం ఏకంగా వారినే అంతం చేసింది. చివరికి తన ప్రాణాలు తాను తీసుకుంది. ఆమె తీసుకున్న నిర్ణయం వల్ల ఒక కుటుంబం మొత్తం తీరని దుఃఖంలో మునిగిపోయింది. తల్లిదండ్రులు చనిపోయి.. సోదరి కూడా ఇలా కనుమూయడంతో సురేఖ సోదరుడు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. ఇంతటి ఘోరం ఏ కుటుంబానికి రాకూడదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

రెండో టెస్ట్ డ్రా

టీమిండియా కొంప ముంచిన లంక

డబ్ల్యూటీసీ ఫైనల్ వెళ్లాలంటే గిల్ సేన ముందున్న మార్గం అదే





శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య ఫలితం ఎదురైంది. విజయం ఖాయమనుకున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. సోనాల్ దినుషా(264 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 133 నాటౌట్) అజేయ శతకంతో టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసాడు. మరోవైపు ఓటమి తప్పదనుకున్న మ్యాచ్‌లో సోనాల్ దినుషా, టెయిలెండర్ల అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో శ్రీలంక డ్రాతో గట్టెక్కింది. దాంతో ఈ రెండు టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది.229/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌ను 154 ఓవర్లలో 429/9 స్కోర్ వద్ద డ్రా చేసింది. రెండో ఇన్నింగ్స్ ఆడేందుకు తగిన ఓవర్లు లేకపోవడంతో.. శుభ్‌మన్ గిల్ షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు.జిడ్డు బ్యాటింగ్‌తో..

సోనాల్ దినుషా అజేయ శతకంతో పాటు పసింధు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92), కామిందు మెండీస్(92 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 55), కేశర నువాంత(150 బంతుల్లో 4 ఫోర్లతో 46) విలువైన పరుగులు చేశారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(3/121), రవీంద్ర జడేజా(3/94) మూడేసి వికెట్లు తీయగా.. ప్రసిధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, సారాన్ష్ జైన్ తలో వికెట్ తీసారు.

తొలి సెషన్‌లోనే ఫలితం తేలుతుందని భారత్ భావించగా.. సోనాల్ దినుషా, కేశర నువాంత అడ్డుగోడగా నిలిచారు. భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. 32 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన ఈ ఇద్దరూ.. తొలి సెషన్‌లో 100 పరుగులు జోడించారు. దాంతో శ్రీలంక 329/6 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది..

లంక మ్యాచ్ ఫలితం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ఫైనల్ రేసులో భారత్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది.భారత్ పరిస్థితి ఏంటంటే..?ఈ మ్యాచ్ గెలిచి భారత్ 2-0తో సిరీస్ కైవసం చేసుకొని ఉంటే పాయింట్స్ టేబుల్‌లో నాలుగో స్థానానికి దూసుకొచ్చేది. కానీ ఈ మ్యాచ్ డ్రా కావడంతో భారత్ ఐదో స్థానంలోనే కొనసాగుతోంది. టీమిండియా విజయాల శాతం 53.33 నుంచి 51.52కి పడిపోయింది.ఆస్ట్రేలియా చేతిలో బంగ్లాదేశ్ ఓటమితో పాయింట్స్ టేబుల్‌లో ఎగబాకే అవకాశం రాగా.. భారత్ చేజార్చుకుంది. డబ్ల్యూటీసీ 2027 సైకిల్‌లో భారత్ ఇంకా ఏడు టెస్ట్‌లు ఆడాల్సి ఉంది. భారత్ ఫైనల్ చేరాలంటే మిగిలిన ఏడు టెస్ట్‌ల్లో ప్రతీ మ్యాచ్ గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నవంబర్‌లో న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనున్న భారత్.. అక్కడ రెండు టెస్టులు ఆడనుంది. ఆ తర్వాత వచ్చే ఏడాది ఐపీఎల్‌కు ముందు ఆస్ట్రేలియాకు ఆతిథ్యమివ్వనున్న భారత్.. ఐదు టెస్టుల బోర్డర్-గావస్కర్ సిరీస్ ఆడనుంది. బంగ్లాదేశ్ చేతిలో ఆస్ట్రేలియాకు ఎదురైన అనూహ్య పరాజయంతో భారత్‌కు కొంత ఊరట లభించినప్పటికీ.. ఫైనల్ బెర్త్ కోసం టీమిండియా శ్రమించాల్సిందే.మిగిలిన టెస్టుల్లో అత్యధిక విజయాలు సాధించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మిగిలిన ఏడు టెస్టుల్లో ప్రతి మ్యాచ్‌ను గెలిచేలా చూసుకోవాలి. అన్ని మిగిలిన మ్యాచ్‌ల్లో గెలిస్తే భారత్‌కు గణనీయంగా పెరుగుతుంది. మొత్తం ఏడు టెస్టుల్లో ఏడు విజయాలు ఉంటే భారత్ విజయాల శాతం 68.52 శాతానికి చేరుతుంది. అదే 6 విజయాలు, 2 ఓటములు అయితే విన్నింగ్ పర్సంటేజీ 62.96 శాతానికి పడిపోతుంది.



సెంచరీతో చెలరేగిన దినుషా..

రెండో సెషన్‌లో కేశర నువాంత ఔటవ్వడంతో ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే ప్రభాత్ జయసూర్య కూడా ఔటవ్వడంతో భారత శిబిరంలో ఆశలు చిగురించాయి. కానీ లాహిరు కుమారతో కలిసి సోనాల్ దినుషా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. జిడ్డుగా ఆడిన ఈ జోడీ.. భారత బౌలర్ల సహనాన్ని దెబ్బతీసింది. 383/8 స్కోర్‌తో శ్రీలంక టీ బ్రేక్‌కు వెళ్లింది.ఆఖరి సెషన్‌లోనూ ఇదే ప్రదర్శనను కొనసాగించిన శ్రీలంక 400 పరుగుల మార్క్‌ను అందుకుంది. 196 బంతుల్లో దినూషా సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 90 బంతులాడిన లాహిరు కుమారను జడేజా ఔట్ చేసినా ఫలితం లేకపోయింది. అసితా ఫెర్నాండో(0 నాటౌట్) కలిసి దినుషా మరో 10 ఓవర్లు ఆడగా.. శ్రీలంక డిక్లేర్ చేసింది. శుభ్‌మన్ గిల్ వెంటనే షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు. వర్షం అంతరాయం, పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడం, భారత ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం లోపించడం.. గిల్ సేన విజయాన్ని అడ్డుకున్నాయి.శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య ఫలితం ఎదురైంది. విజయం ఖాయమనుకున్న మ్యాచ్‌లో టీమిండియా పేలవ బౌలింగ్ ప్రదర్శనతో డ్రాకు తల వంచింది. ఈ టెస్ట్‌లో సోనాల్ దినుషా(264 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 133 నాటౌట్) అజేయ శతకంతో శ్రీలంక గట్టెక్కింది. దాంతో ఈ రెండు టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది.229/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌ను 154 ఓవర్లలో 429/9 స్కోర్ వద్ద డ్రా చేసింది.

చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్మెంట్ తో ధోనికి విభేదాలు

ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ కు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆ జట్టుకు విపరీతమైన ఫ్యాన్ బేస్ ఉంది. చెన్నై జట్టును ఐపీఎల్లో ఐదుసార్లు విజేతగా నిలిపిన చరిత్ర ధోనికి ఉంది. ధోనికి ఇప్పుడు 40 కి పైగా సంవత్సరాలు. అయినప్పటికీ అతడు చెన్నై జట్టులో కొనసాగుతున్నాడు. చెన్నై జట్టు తరపున అతడు ప్రత్యక్షంగా ఆడలేక పోతున్నప్పటికీ.. జట్టులో ఉంటున్నాడు.

అతడు ఆడకపోయినప్పటికీ జట్టులో కనిపిస్తే చాలు అని అభిమానులు చాలామంది ఉన్నారు. పైగా ధోనిని చెన్నై అభిమానులు తలా అని ముద్దుగా పిలుస్తుంటారు. గడచిన 18 సంవత్సరాలుగా ధోని చెన్నై జట్టుతో తన ప్రయాణాన్ని సాగిస్తున్నాడు. చెన్నై జట్టుకు ధోని గత సీజన్లో తాత్కాలిక సారధిగా వ్యవహరించాడు. ఇటీవల సీజన్లో ధోని గాయం తగ్గకపోవడంతో చెన్నై జట్టు తరఫున మైదానంలోకి దిగలేదు. దీంతో ధోని రిటైర్మెంట్ ప్రకటిస్తాడని వార్తలు వచ్చాయి. అయితే ఆ వార్తలను చెన్నై యాజమాన్యం ఎప్పటికప్పుడు ఖండించుకుంటూ వచ్చింది.

తాజాగా చెన్నై విషయంలో ధోని కి సంబంధించి ఒక ఇంట్రెస్టింగ్ వార్త క్రీడా వర్గాలలో విస్తృతంగా ప్రచారంలో ఉంది. వాస్తవానికి చెన్నై జట్టును.. ధోనిని విడదీసి చూసే అవకాశం ఉండదు. ఆ జట్టుకు ఎన్నో ట్రోఫీలు అందించిన చరిత్ర ధోనికి ఉంది. అయితే చెన్నై జట్టు విషయంలో మహి ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. చెన్నై జట్టులో 25% వాటా కొనుగోలు చేస్తానని యాజమాన్యానికి ధోని తెలిపారని తెలుస్తోంది. అయితే కేవలం మూడు శాతం మాత్రమే విక్రయిస్తామని చెన్నై యాజమాన్యం ధోనికి చెప్పినట్టు సమాచారం అయితే ధోని 20 శాతానికి ఆపై 18 శాతానికి తగ్గాడు. చెన్నై యాజమాన్యం 5.5% మాత్రమే ఫైనల్ అని తేల్చినట్టు క్రీడా వర్గాలు చెబుతున్నాయి. దీంతో చెన్నై జట్టుతో ధోని సంబంధాలు దెబ్బ తిన్నాయని వార్తలు వినిపిస్తున్నాయి. నేషనల్ మీడియాలో కూడా ఇదే తీరుగా వార్తలు వస్తున్నాయి. ఒకవేళ అదే గనుక నిజమైతే దాదాపు 18 సంవత్సరాల అనుబంధానికి ధోని ముగింపు పలికినట్టే.

చెన్నై జట్టుతో ధోని కొనసాగాలని అభిమానులు కోరుకుంటున్నారు. యజమాన్యం.. ధోనిమధ్య ఏర్పడిన వివాదం సమసి పోవాలని అభిమానులు కోరుతున్నారు.” ధోని చెన్నై జట్టులో ఉండాలి.. అతడు చెన్నై జట్టులో ఆడాలి. అతడు ఆడితేనే బాగుంటుంది” అని అభిమానులు సోషల్ మీడియాలో వ్యాఖ్యానిస్తున్నారు.

టాక్సిక్ మూవీ రివ్యూ : జీరో కిక్



కే.జీ.ఎఫ్ 1 & 2 సినిమాలు భారీ స్థాయిలో విజయం సాధించడంతో యష్ ఒక్కసారిగా కన్నడ హీరో నుంచి ప్యాన్ ఇండియా హీరోగా మారిపోయాడు. దీంతో సహజంగానే రాకింగ్ స్టార్ యష్ తన నెక్ట్స్ సినిమాకు ఎలాంటి కథను ఎంచుకుంటాడు, డైరెక్టర్ ఎవరు అని ప్రేక్షకులందరూ ఆసక్తిగా ఎదురుచూశారు. గీతు మోహన్ దాస్ దర్శకత్వంలో 'టాక్సిక్' ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసినప్పుడు ప్రాజెక్టుపై కొందరు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ టీజర్ లో గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యం, ప్రోమో మెటీరీయల్ బోల్డ్ గా ఉండడంతో సినిమా బాగుంటుందేమో అని కొందరిలో ఓ మోస్తరు అంచనాలు నెలకొన్నాయి. ఈరోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ టాక్సిక్ ఆడియన్స్ ను అలరించిందా లేదా అనేది రివ్యూలో చూద్దాం.

ఇదో పీరియడ్ బ్యాక్ డ్రాప్ కథ. 1940 నుంచి 1970ల మధ్య కాలంలో ఒక సాధారణ వ్యక్తి స్థాయి నుంచి క్రైమ్ సిండికేట్ ను శాసించే స్థాయికి ఎదిగిన రాయా(యష్) జీవితంలో జరిగే సంఘటనల సమాహారమే ఈ టాక్సిక్. అతని జీవితంలో మరో ముఖ్య పాత్ర పోషించే మనిషి తన సోదరి గంగ(నయనతార). చిన్నతనంలో అనాథలు గా మారినప్పుడు రాయాను ఒక తల్లి లాగా కాపాడుకుంటుంది. రాయా క్రైమ్ సిండికేట్ ను ఏలే సమయంలో తనకు ఒక రైట్ హ్యాండ్ లాగా తోడుగా ఉంటుంది. క్రైమ్ సిండికేట్ లో కీలకస్థానంలో ఉన్న సాల్వడార్ కూతురు రెబెకా(తారా సుతారియా)ను రాయా పెళ్లి చేసుకోవాల్సి వస్తుంది. మరోవైపు సర్కస్ లో పనిచేసే నాడియా (కియారా అద్వానీ) తో రాయా రిలేషన్ కొనసాగిస్తూనే ఉంటాడు. ఒక కొడుకును కంటాడు. కొంతకాలం తర్వాత నాడియాకు దూరం అవుతాడు. కథలో పెద్ద ట్విస్ట్ ఎప్పుడంటే రాయా తన కొడుకు టికెట్ (యష్) ను కలవడమే. వీరిద్దరి మధ్యలో ఏం జరిగింది? గంగకు ఏమైంది. ఎలిజబెత్(హుమా ఖురేషీ) ఎవరు? ఈ పాత్రల మధ్య సాగిన డ్రామా, యాక్షన్ లాంటి అంశాలే ఈ సినిమాలో మిగతా స్టోరీ.

దర్శకురాలు గీతు మోహన్ దాస్ ఈ సినిమాను ఒక బోల్డ్ అండ్ డార్క్ థీమ్ లో ప్రెజెంట్ చేయాలని ప్లాన్ చేశారు కానీ కథ, స్క్రీన్ ప్లేల విషయంలో మాత్రం శ్రద్ధ పెట్టలేదని క్లియర్ గా కన్పిస్తుంది. ఎప్పుడో 80 ఏళ్ల క్రితం జరిగే కథ, లెక్కలేనన్ని పాత్రలు..కొన్ని నోరు తిరగని పాత్రల పేర్లు.. ఎవరు ఏం చేస్తారో తెలిసేలోపు కొత్త ఎపిసోడ్ రావడం.. ఇలా కథను తికమకగా ప్రెజెంట్ చేసి, ఆ కథకు మిగతా హంగులు జోడించింది. దీంతో మనమేం ఏం చూస్తున్నామో, ఎందుకు చూస్తున్నామో తెలియక, సినిమా బాగుందో – బాగలేదో అర్థం కాక బుర్ర గోక్కుంటాం. బోల్డ్ గా ఉండే రెండు మూడు సీన్లు కాస్త హై ఇస్తాయేమో కానీ.. అసలు వయొలెన్స్ ఎందుకు వస్తుందో ఒక లాజిక్ కూడా ఉండదు. ఎంత అండర్ వరల్డ్ సినిమా అయినా వాళ్ళు 24 గంటలూ కాల్చుకుంటూనే ఉండరు. ఆఖరికి మటన్ కొట్టు మస్తాన్ కూడా రాత్రి పూట ఖైమా కొట్టడం మానేసి, షాప్ కట్టేసి ఇంటికి పోయి పడుకుంటాడు. ఆ లాజిక్ ను గీత మోహన్ దాస్ మరచిపోవడం ఈ సినిమా చూసే ప్రేక్షకుల ప్రాణానికి వచ్చింది. స్టైలిష్ మేకింగ్ ఉంది కానీ యాక్షన్ ఎపిసోడ్స్ ఓవర్ డోస్ కావడంతో ఒక దశ దాటేసరికి బ్రిమ్మి సార్ లాగా 'మీ అమ్మ కడుపులు కాల.. ఇక చాలు ఆపండ్రోయ్' అని ఘట్టిగా అరవాలని అనిపిస్తుంది కానీ రవి బస్రూర్ బాదుడు ముందు మీ గొంతు ఎవరికీ వినిపించదని ఊరుకోవాల్సి వస్తుంది. సినిమాలో ఎమోషనల్ కనెక్ట్ లేదు. కెజీఎఫ్ ను రిఫరెన్స్ గా పెట్టుకుని కొన్ని ఎపిసోడ్స్ రాసుకున్న విషయం కూడా తెలిసిపోతుంది. ఇక యష్ అయితే కేజీఎఫ్ హ్యాంగోవర్ నుంచి బయటకు రాలేదని కూడా అర్థం అవుతుంది.

ఈ సినిమాలో రైటింగ్ వీక్. నాలుగైదు డైలాగులు.. అవీ కేజీఎఫ్ ఫ్లేవర్ లోనే ఉన్నాయి. అవి తప్ప మిగతా అంతా సోది. స్టోరీ ఎలాగైనా ఉండొచ్చు కానీ స్క్రీన్ ప్లే విషయంలో పూర్తిగా తడబడ్డారు. సినిమాటోగ్రఫీ చాలా బాగుంది, రవి బస్రూర్ సంగీతం కొన్ని చోట్ల బాగుంది కానీ యాక్షన్ ఓవర్ డోస్ వల్ల అదీ పెద్దగా ఇంపాక్ట్ ఉన్నట్టు అనిపించదు. ఇక ఈ సినిమాను మరో అర్ధగంట, ముప్పావు గంట ట్రిమ్ చేసినా పెద్దగా నష్టం లేదు. ఆర్ట్ డిపార్ట్మెంట్ కష్టం తెరపై కనిపిస్తుంది, ప్రొడక్షన్ వ్యాల్యూస్ రిచ్ గా ఉన్నాయి.

నటీనటుల విషయననికి వస్తే రాయా గా యష్ కెజీఎఫ్ రాకీ స్టైల్ లోనే కనిపించాడు. కానీ టికెట్ పాత్రలో యష్ నటన కొత్తగా ఫ్రెష్ గా ఉంది. నయనతార, కియారా అద్వాని, తారా సుతారియా, హుమా ఖురేషి, రుక్మిణీ వసంత్ అందరూ తమ పాత్రల పరిధి మేరకు నటించారు. అందరిలో కియారా నటన కొంచెం ఎక్కువగా ఆకట్టుకుంటుంది.

సినిమాలో ఏం బాగున్నాయో తెలుసా?

1. సినిమాటోగ్రఫీ

2. ఆర్ట్ డిపార్ట్ మెంట్ వర్క్

సినిమాలో బాగలేనివి ఇవి:

1. అవకతవక, తికమక స్క్రీన్‌ప్లే
2. బలమైన ఎమోషనల్ కనెక్ట్ లోపించడం
3. 3.14 నిముషాల రన్ టైమ్

రేటింగ్: 1.5/5

ఫైనల్ వర్డ్: డ్రంక్ డ్రైవ్ నిందితులకు శిక్షగా సూచిస్తే బెటర్

జస్ట్ ఆస్క్ మీ...టాలీవుడ్ లో మరో కొత్త ఉద్యమం



ప్రస్తుతం సోషల్ మీడియా అందరికి అందుబాటులో ఉండడంతో ప్రతి ఒక్కరు సమాజంలో జరిగే ప్రతి విషయం మీద స్పందిస్తూ వల్ల అభిప్రాయాలను సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తున్నారు... ఒక సంఘటన మీద ఎవరి అభిప్రాయాలను వాళ్ళు తెలియజేస్తున్నారు. అందులో తప్పు ఎవరిది ఒప్పు ఎవరిది అనేది మనం నిర్ణయించలేము...సామాన్య ప్రజలు వాళ్ల అభిప్రాయాలను తెలుపడం లో ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఎందుకంటే వాళ్ళ మాటలను ఫాలో అయ్యే వాళ్ళు గాని, పట్టించుకునే వాళ్లు గాని ఎవరు ఉండరు కాబట్టి వాళ్ళు ఏం చెప్పినా నడుస్తుంది. కానీ సినిమా ఇండస్ట్రీలో నటులుగా ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న కొంతమంది సొసైటీలో జరిగే ప్రతి విషయం మీద 'జస్ట్ ఫర్ ఆస్కింగ్' అంటూ వాళ్ల అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు. దీనివల్ల కొంతమంది నటులు ప్రేక్షకుల నుంచి తీవ్రమైన విమర్శలను సైతం ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రకాష్ రాజు లాంటి నటుడు దేశంలో జరిగే రాజకీయ పరిణామాల మీద జస్ట్ ఫర్ ఆస్కింగ్ అంటూ ఏదో ఒక క్వశ్చన్ అయితే అడుగుతున్నాడు. దానికి జనాలు సైతం అదే రేంజ్ లో ఆన్సర్ ఇస్తున్నారు. దీనివల్ల ఆయన చాలా వరకు తన ఇమేజ్ ని డామేజ్ చేసుకుంటున్నాడు. ఒకప్పుడు ప్రకాష్ రాజ్ అంటే విలక్షణమైన నటుడిగా మాత్రమే గుర్తుకు వచ్చేవాడు. కానీ ఇప్పుడు కాంట్రవర్సీలో ఇరుక్కుంటూ తీవ్రమైన వివాదాలకు తెరలేపుతున్నాడు.

ఏది ఏమైనా కూడా ప్రకాష్ రాజ్ ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాల్సిన అవసరమైతే ఉందని కొంతమంది సినీ మేధావులు చెబుతున్నారు. శ్రీకాంత్ అయ్యంగార్ సైతం తెగేసి ఏదో ఒకటి మాట్లాడి వీడియో రికార్డు చేసి అప్లోడ్ చేస్తారు... దాని గురించి ఒక రెండు మూడు రోజులు చర్చ జరుగుతుంది... అలాగే రాహుల్ రామకృష్ణ సైతం తనకు ఇష్టం వచ్చినట్టుగా ట్వీట్స్ చేస్తూ మళ్ళీ వాటిని డిలీట్ చేస్తుంటాడు. దానివల్ల ఆయన రాజకీయపరంగా కూడా చాలా వరకు విమర్శలను ఎదుర్కొంటున్నాడు.

ఏది ఏమైనా కూడా వీళ్ళందరు నటులుగా మంచి గుర్తింపును సంపాదించుకున్నారు కాబట్టి వాళ్లు ఏదైనా చెబితే సొసైటీ దాన్ని అనుసరించే అవకాశం ఉంది. కాబట్టి వాళ్ళు ఏం చెప్పాలనుకున్నా కూడా ఆచితూచి ఒకటికి పది సార్లు ఆలోచించి చెబితే మంచిదని మరి కొంతమంది నెటిజన్లు కామెంట్లు చేస్తుండడం విశేషం...



సారా అర్జున్ తన తాజా లుక్‌తో ఆకట్టుకుంటోంది. గ్రీన్ యానిమల్ ప్రింట్ హాల్టర్ నెక్ టాప్‌లో, భుజంపై వాలిన లాంగ్ వేవీ హెయిర్‌తో సాఫ్ట్ స్టైల్ ఇస్తూ కనిపించిన ఆమె ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 2005 జూన్ 18న ముంబైలో జన్మించిన సారా అర్జున్.. చిన్న వయసులోనే కమర్షియల్స్ ద్వారా కెరీర్ ప్రారంభించింది. 2011లో 404 సినిమాతో బాలనటిగా వెండితెరకు పరిచయమైన ఆమె.. దైవ తిరుమగల్లో నిఖా పాత్రతో మంచి గుర్తింపు తెచ్చుకుంది.

Printed and published by oktelugu Chairmen Bhaskar Rao Katiki, on behalf of Swarna Enterprises Private Limited. Hitec ciry, Hyderabad-500030.
Editor: A.Naresh email: oktelugu.com@gmail.com